క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యసేవలు



ఆర్టీసీ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల అర్బన్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీ, రైట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. డ్రైవర్లకు, సిబ్బందికి రైట్ హాస్పిటల్ వైద్యబృందం వైద్యపరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందించారు. డిపో మేనేజర్ జె.శ్యామల మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. ప్రయాణ సమయంలో చేసే చిన్న చిన్న తప్పుల కారణంగా నిండు జీవితాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో ఎంతో ఏకాగ్రతతో ఉండాలన్నారు. పయూనియన్ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించండి



వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

చీరాల: ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఈపురుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బుధవారం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలు కాకుండా ఉండటం వలన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రభుత్వం ప్రజల రక్షణ కోసమే చట్టాలు రూపొందించిందన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

యద్దనపూడి: చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. బుధవారం చింతపల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యారంభ సంరక్షణ విద్య (ఈసీసీఈ) కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రతినెలలో మెదటి బుధవారం జరిగే కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్‌లో భాగంగా చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ. భాగమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆటవిడుపునకు ఆటంకం

- చిల్డ్రన్స్ పార్కులో పాడైపోయిన ఆట వస్తువులు
- గాయాలపాలవుతున్న చిన్నారులు
- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది
మూతబడిన మరో చిల్డ్రన్స్ పార్కు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారనే వివక్ష

అద్దంకి రూరల్:

చారిత్రక ప్రాధాన్యతగల అద్దంకి పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. మున్సిపాలిటీ హోదాలో బోలెడన్ని పన్నులు వసూలు చేస్తారు. కానీ ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై మాత్రం నేటి టీడీపీ హయాంలోని ప్రభుత్వం చొరవ తీసుకోవడంలేదు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న చిల్డ్రన్స్ పార్కులో ఆడుకునే పరికరాలు పాడైపోయి తుప్పుపట్టి విరిగిపోయాయి. మరో పార్కుకు మున్సిపాలిటీ అధికారులు తాళాలు వేశారు. దీంతో సాయంకాలం సరదాగా గడుపుదామనుకొనే చిన్నారులు ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

అద్దంకి పట్టణాభివృద్ధిలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక గవర్నమెంట్ హైస్కూల్ ఆవరణ, స్థానిక కాకానిపాలెంలో పిల్లలు, మహిళలకు రెండు పార్కులు ఏర్పాటు చేశారు. వారు చిన్నపాటి వ్యాయామం చేసుకునేందుకు, ఆడుకునేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో అవి తుప్పుపట్టి విరిగిపోయాయి. అయితే చిన్న పిల్లలు వాటిపై అలాగే ఎక్కి ఆడుకునేందుకు ప్రత్నించి గాయాల పాలవుతున్నారు. ఉన్న రెండు చిన్నపిల్లల పార్కుల్లో ఒకదానికి తాళం వేశారు. హైస్కూల్‌లోని పార్కులో పరికరాలు విరిగిపోయాయి.

దీంతో పిల్లలను పార్కుకు తీసుకెళ్లే అవకాశమే లేకుండా పోయింది. అద్దంకి ప్రజల కోరిక మేరకు వైఎస్సార్ సీపీ హయాంలో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేసి చూపించారు. దానిలో భాగంగానే అద్దంకి వాసులు చిరకాల వాంఛ అయిన పార్కులను ఏర్పాటు చేశారు. కూటమి పాలన రాక ముందు వరకు మున్సిపల్ సిబ్బంది పార్కులను బాగానే చూసుకున్నారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి పట్టణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేశారన్న వివక్షతోనే అద్దంకి మున్సిపాలిటీ పట్టించుకోవటంలేదని అద్దంకి వాసులు భావిస్తున్నారు. పట్టణంలోని రెండు పార్కులు ప్రజలకు అందుబాటులో లేక మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు గత 6నెలల నుంచి అవస్థలు పడుతున్నా తామేమి చూడనట్లు, తమకు తెలియనట్లు పట్టీపట్టనట్లు మున్సిపాలిటీ అధికారులు వ్యవహరిస్తున్నారు.



తాళం వేసి ఉన్న అద్దంకిలోని కాకాని పాలెం పార్కు



మరమ్మతులకు గురైన రంగుల రాట్నం



ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చిల్డ్రన్స్ పార్కులో విరిగిపోయిన ఊయల

మరమ్మతులు చేయిస్తాం

పట్టణంలో ఉన్న రెండు పార్కులను పర్యవేక్షించి అందులో పాడైపోయిన వస్తువులకు మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకువస్తాం. అలాగే కాకాని పాలెంలోని పార్కుకు తాళం వేసిన కారణాలను కనుక్కొని వాడుకలోకి తీసువచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచుతాం.

– లోకేష్, అద్దంకి మున్సిపల్ ఏఈ

నేడు కార్యకర్తలతో హనిమిరెడ్డి సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు బుధవారం పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారం అందించండి



చిన్నారి బరువు పరిశీలిస్తున్న సీడీపీఓ

బల్లికురవ: చిన్నారుల వయస్సుకు తగ్గ ఎత్తు బరువు రావాలంటే పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో బీవీ సుధ అన్నారు. బుధవారం ఈసీసీఈ దినోత్సవం సందర్భంగా కొప్పరపాడు సెక్టార్ పరిధిలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలోని 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువులు పరిశీలించి బాలామృతం, బాల సంజీవిని కిట్లు పంపిణీ చేశారు. చిన్నారులకు తక్కువ మొత్తంలో ఎక్కువపార్లు ఆహారాన్ని అందించాలన్నారు. బరువు ఎత్తు, తక్కువగా ఉన్న చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సలోమి, కార్యకర్తలు నాగమణి అంకమ్మ పాల్గొన్నారు.

జ్యోతయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సేవాసంస్థల సభ్యులు

అద్దంకి రూరల్: సామాజిక సేవకుడు పంతంగి జ్యోతయ్య సోమవారం బెంగళూరులోని ఆర్మీ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని బుధవారం కుటుంబ సభ్యులు అద్దంకిలోని స్వగృహానికి తీసుకునివచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పలుస్వచ్ఛంద సేవా సంస్థలు, మిత్రులు నివాళులర్పించారు.

హైరిస్క్ గర్భిణులతో జాగ్రత్త

స్వర్ణ(కారంచేడు): గ్రామాల్లో రక్తహీనతతో ఇబ్బందులు పడే హైరిస్క్‌లో ఉన్న గర్భిణులు ప్రసవ సమయం వరకు వైద్యుల సూచనలతో తగు జాగ్రత్తగా ఉండాలని, వైద్య సిబ్బంది కూడా వారికి అందుబాటులో ఉండాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాలిని అన్నారు. బుధవారం స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల సమావేశంలో మాట్లాటారు. గర్భిణులకు మూడో నెల వచ్చిన వెంటనే వారి పేర్లు, వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి క్రమం తప్పకుండా మీరు అందించాల్సిన వైద్య సేవలను వారు గుర్తు చేస్తూ ఉండాలన్నారు. క్రమం తప్పకుండా వేయించాల్సిన టీడీలు, హిమోగ్లోబిన్ శాతాన్ని గుర్తించి అవరమైన మాత్రలు, ఆరోగ్య సూచనలు అందిస్తారన్నారు. అసరమైన స్కానింగ్‌లు చేసి బిడ్డ ఎదుగుదల విషయంలో వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ప్రసవ సమయానికి ముందే స్థానిక ఆశాలు గర్భిణులను వైద్యశాలకు పంపించే ఏర్పాట్లు చేస్తారన్నారు. ఎంపీహెచ్ఈఓ వి. నాగేశ్వరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్, ఏఎన్ఎంలు, ఆశలు, స్వర్ణ, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, కేశవరప్పాడు, స్వర్ణపాలెం, రంగప్పనాయుడువారిపాలెం గ్రామాలకు చెందిన గర్భిణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పరస్పర సహకారంతోనే జీవనం



వృత్తి నైపుణ్య పురస్కారాలు పొందిన వృత్తికారులు

అద్దంకి: సమాజంలో వివిధ వృత్తుల చేసే వారి పరస్పర సహకారంతోనే మానవ జీవనం సాధ్యం అవుతుందని రిటైర్డ్ ఆర్జేడీ యు. దేవపాలన అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో బుధవారం 11 మందికి వృత్తి నైపుణ్య పురస్కారాలను అందజేశారు. రొటేరియన్ అన్నంగి సుబ్బారవు మనమడు అభిరామ్ పుట్టిన రోజు సందర్భంగా వారి సౌజన్యంతో నిర్వహించారు. వీరవల్లి వెంకటేశ్వర్లు, బత్తుల ఆంజనేయయులు, వెంకటేశ్వరరావు, కొలకలూరి నాగేశ్వరరావు, పోలంరాజు మారుతి, కోటేశ్వరరావు, శివన్నారాయణ, చెన్నుపల్లి ఆజిబాబు, బడే సాహెబ్, అంబలిరి వెంకట్రావుకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. రోటరీ కార్యదర్శిచుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, వీరవల్లి సుబ్బారావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అన్నంగి సుబ్బారావు, ఊటుకూరు రామకోటేవ్వరరావు, సంక్రా సుబ్రహ్మణ్యం, మన్నం త్రిమూర్తులు, నార్ర శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, ఆర్‌వీ రాఘురావు, రోటేరియన్లు ఇతర పెద్దలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న డాక్టర్ ఇస్తర్ల బాబురావు

చీరాల రూరల్:

క్యాన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రేమ హార్ట్ అండ్ డయాబెటిస్ ఆస్పత్రి అధినేత గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఇస్తర్ల బాబురావు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజిలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బాబురావు మాట్లాడారు. క్యాన్సర్ కారకాలైన పాన్ మసాలాలు, పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లు, గుట్కాలు, ఖైనీలు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అలానే మహిళలు కూడా క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్ వంటివాటిపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎటువంటి అనుమానం ఉన్నా తక్షణమే వైద్యులను సంప్రదించి ముందస్తు వైద్యం చేయించుకుంటే క్యాన్సర్‌ను మటుమాయం చేయవచ్చునని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ మురళి, ఇన్నర్‌వీల్ సభ్యులు ఇస్తర్ల సుభాషిణి, రూప, నళిని పాల్గొన్నారు.

మాజీ ఎంపీని కలిసిన నాయకులు



సురేష్‌ను కలిసిన ప్రసాద రెడ్డి, స్థానిక నేతలు

బల్లికురవ: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను బుధవారం ఉద్దండరాయుని పాలెంలోని ఆయన స్వగృహంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, స్థానిక నేతలతో వెళ్లి కలిసి పరామర్శించారు. కూటమి ప్రభుత్వం సురేష్‌పై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపటంతో ఇటీవలే జైలునుంచి విడుదలతో ఇంటికి వచ్చారు. ఆరోగ్య పరిస్థితిని వాకబ్ చేసి ధైర్యంగా ఉండాలన్నారు. ప్రసాదరెడ్డి, మండల, స్థానిక నాయకులున్నారు.

పరిమితికి మించి ప్రయాణం ప్రమాదం

కారంచేడు: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటోల్లో ప్రయాణించే వారు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ వి. వెంకట్రావు అన్నారు. బుధవారం స్వర్ణ–కారంచేడు, కుంకలమర్రు–కారంచేడు, ఆదిపూడి–కారంచేడు రహదారుల్లో తిరిగే ఆటో వాలాలకు ప్రయాణాలపై అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించి, మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేయడం ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. ప్రయాణికులు సైతం మితిమీరిన వేగంతో వెళ్లే ఆటోలు, వాహనాలను ఎక్కవద్దన్నారు. ప్రయాణాలు సురక్షితంగా ఇంటికి చేరేలా ఉండాలి గానీ, ప్రమాదాలకు గురయ్యే విధంగా ఉండవద్దన్నారు. ఆటోవాలాలు పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపే వారు తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

శనగ తెగుళ్లతో జాగ్రత్త

ఇంకొల్లు(చినగంజాం): శనగ పంటకు తెగుళ్ళు రాకుండా కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. వేణుగోపాల్ సూచించారు. నాగండ్ల, సూదివారి పాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయాధికారి వేణుగోపాల్ మొక్కజొన్న, శనగ పంటలను పరిశీలించారు. ఇ- పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట అమ్ముకోవచ్చని తెలిపారు. పశుసంవర్ధక శాఖ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి: శనగలో వచ్చే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి మేరమ్మ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని గన్నవరం, పూనూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రైతులతో కలిసి శనగపంట పరిశీలించారు. కుంకుమ తెగులు, ఎండు తెగులు ఉధృతి ఎక్కువగా ఉందని దీని కోసం ఎక్సాకోనాజోల్ తెగులు మందును 400 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలుపుకొని పంటపై పిచికారీ చేయాలన్నారు. వీఏఏలు ఏసుదాసు, హరీష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): శనగలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పంట దిగుబడులు సాధించవచ్చు అని బాపట్ల ఏరువాక కేంద్రం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ బాల మురళీధర్ నాయక్ అన్నారు. పర్చూరు మండలం బోడవాడలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పర్చూరు వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహన రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. బాపట్ల ఏరువాక కేంద్రం సైంటిస్టులు, రీజనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్ సైంటిస్టులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక సమన్వయకర్త డాక్టర్ బాలమురళీధర్ నాయక్ మాట్లాడుతూ శనగలో పంట మార్పిడి విధానం ద్వారా మాత్రమే ఎండు తెగులు, వేరుకుళ్ళు తెగులును నివారించవచ్చు అని తెలిపారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి శనగ వేసే రైతులు జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలను శనగకు బదులుగా వేసుకోవాలని తెలియజేశారు. సైంటిస్ట్ డాక్టర్ కామాక్షి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా శనగపంటలో విత్తనశుద్ధి చేసుకోవాలని బావిస్టిన్ లేదా టేబుకోనాజోలు లేదా ఎవర్‌గోల్డ్‌తో కానీ చేసుకోవాలని తెలిపారు. శనగ పంట వేసే రైతులు తప్పనిసరిగా భూమిలో ట్రైకోడర్మావిరిడిని 4 కేజీలు, 90 కేజీల పశువుల ఎరువులో కలిపి 15 రోజులు నిలువబెట్టిన తరువాత దుక్కిలో చల్లుకోవాలని తెలిపారు. డాక్టర్ ఉష మాట్లాడుతూ శనగలో వచ్చు పురుగులు, తెగుళ్ళ నివారణ గురించి వివరించారు. బాపట్ల జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ టి. రత్నకుమారి మాట్లాడుతూ రైతులు పంట లేనప్పుడు భూసార పరీక్షలు చేయించుకోవాలని, పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకొని భూసారాన్ని పెంచుకోవచ్చునని తెలిపారు. పర్చూరు ఏడీఏ ఎస్. మోహనరావు మాట్లాడుతూ ప్రతి రైతుకు ఫార్మర్ ఐడీ ఇస్తున్నామని రైతులు తమ పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు తీసుకొని రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి ఐడీ నంబర్ తీసుకోవాలని వివరించారు. రాబోయే రోజుల్లో రైతులకు ఇచ్చే అన్ని రాయితీలను ఈ ఫార్మర్ ఐడీల ద్వారానే ఇస్తారని తెలిపారు. రైతులంతా ఇ- సీజన్‌లో తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. వీఏఏలు ఆదిలక్ష్మి, జెడ్బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో వ్యవసాయానికి అండ

మేదరమెట్ల: వ్యవసాయం చేసే రైతులు డ్రోన్‌లను వినియోగిస్తే తక్కువ సమయం, తక్కువ మందు సరిపోతుందని.. సహాయ వ్యవసాయం సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. కొరిశపాడు మండలంలో నిర్వహిస్తున్న పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం తిమ్మనపాలెం, పి.గుడిపాడు గ్రామాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ డ్రోన్ కొనుగోలు చేసే రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రతి మండలానికి రెండు మూడు డ్రోన్‌లను రైతు గ్రూప్‌లకు అందిస్తామని తెలిపారు. ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు గుర్తింపు కార్డును ప్రవేశ పెడుతుందని దీనికోసం సహాయవ్యవసాయ అధికారి వద్దకు రైతు ఆధార్, పాస్‌బుక్, మొబైల్‌ను తీసుకొని వచ్చి నమోదు చేయించుకోవాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కార్డు ఉపయోగపడుతుందని సూచించారు.

ప్రతిష్ఠకు సీతారామాలయం సిద్ధం





ప్రతిష్ఠకు ముస్తాబవుతున్న సీతారామాలయం, యాగశాల ఏర్పాటు

బల్లికురవ: మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో సీతారామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామ కూడలిలో 7 దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం జీర్ణావస్థకు చేరింది. పునః నిర్మించాలని గ్రామానికి చెందిన వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డ యువత సంకల్పించింది. కమిటీ ఏర్పాటుతో సుమారు రూ. 60 లక్షల అంచనాలతో నిర్మాణ పనులకు రెండు సంవత్సరాల క్రితం శ్రీకారం చుట్టారు. శనివారం యాగశాల ప్రవేశంతో గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధన, ఆదివారం ఏకాదశ రుద్రయంత్రాభిషేకం, దీక్ష కలశపూజ, హోమాలు, జలాధి, క్షీరాధివాసం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తారు. సోమవారం దీక్షా పూజలు గణాహోమాలు, గర్త పూజా న్యాసం, అనంతరం 8 .47 గంటలకు సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత జీవధ్వజ శిఖర యంత్ర ప్రతిష్టా మహోత్సవం మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, తీర్థ ప్రసాదాల పంపిణీ అన్న సంతర్పణ చేపడుతున్నట్లు చెప్పారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాస కృత్తిక నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. సాయంత్రం 5.30 గంలకు శ్రీ సువర్చల ఆనహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఇ- పంట నమోదు చేసుకోండి

బల్లికురవ: రబీలో సాగు చేసే పంటలను పదో తేదీలోపు ఇ- పంట నమోదుతో ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి కోరారు. బుధవారం అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. భూసార పరీక్షలతో పాటు పంటమార్పిడి విధానాన్ని రైతులు అవలంబించాలని రైతులు కోరారు.